
సూర్య
www.suryaa.com
17 వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
www.suryaa.com
4 PM
www.suryaa.com
శనివారం
06 ఏప్రిల్ 2024
పేజీలు: 02





## టీడీపీకి షాకిచ్చిన మహాసేన రాజేష్

మహాసేన రాజేష్ టీడీపీకి షాకిచ్చేందుకు సిద్ధమయ్యారు. టీడీపీకి రాజీనామా చేసి.. రాష్ట్రవ్యాప్తంగా ఇండిపెండెంట్ అభ్యర్థులతో పోటీకి దిగేందుకు రెడీ అయ్యారు. మహాసేన రాజేష్ తన ఫేస్‌బుక్ ఖాతాలో.. 'ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం అనేది ముఖ్యం. దేశమంతా ప్రతీ పార్టీకి ప్రతిపక్షం ఉంది. కానీ ఏపీలో బీజేపీకి ప్రతిపక్షం లేదు. అందుకే స్వతంత్రంగా పోటీకి సిద్ధమయ్యాం. దాదాపు 100 నియోజకవర్గాల్లో పోటీ చేయబోతున్నాం.' అని ప్రకటించారు.



## చంద్రబాబుకు ఘోర అవమానం

టీడీపీ అధినేత చంద్రబాబుకు ఘోర అవమానం జరిగింది. తూ.గో. జిల్లాలో ఎన్నికల ప్రచారంలో ఉన్న చంద్రబాబుకు తెలుగు తమ్ముళ్లు భారీగా షాకిచ్చారు. గోపాలపురం టికెట్ విషయంలో టీడీపీ శ్రేణులు అసంతృప్తిలో ఉన్నారు. గోపాలపురం టికెట్‌ను మద్దిపాటి వెంకటరాజుకు కేటాయించడాన్ని మాజీ జెడ్పీ చైర్మన్ ముల్లపూడి బాపిరాజు వర్గీయులు వ్యతిరేకిస్తున్నారు. ఈ మేరకు ప్రచారానికి వచ్చిన చంద్రబాబు కాన్వాయ్‌ను బాపిరాజు వర్గీయులు అడ్డుకొని ఆందోళన చేశారు.



## మిస్టర్ 360 ప్లేయర్ ఆగయా..

సూర్యకుమార్ యాదవ్‌కు గత నెలలో స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ జరిగింది. గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో, ముంబై ఇండియన్స్ జట్టులోని తొలి మూడు మ్యాచ్‌లకు అతను అందుబాటులో లేడు. ఇప్పుడు ఐపీఎల్ 2024లో అడుగుపెట్టిన సూర్య రేపు (ఏప్రిల్ 7) ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగే మ్యాచ్‌లో ఆడనున్నాడు. సూర్యకుమార్ యాదవ్ ఐపీఎల్ (IPL 2024) సీజన్ 17లోకి ప్రవేశించాడు. గత 2 వారాలుగా నేషనల్ క్రికెట్ అకాడమీలో పునరావాసంలో ఉన్న సూర్య ఇప్పుడు పూర్తి ఫిట్‌నెస్‌తో తిరిగి వచ్చాడు. శుక్రవారం ముంబై ఇండియన్స్ జట్టులో కూడా చేరాడు. శుక్రవారం ముంబై ఇండియన్స్ క్యాంపులో చేరిన సూర్యకుమార్ అదే రోజు ప్రాక్టీస్‌కు వెళ్లాడు. కాబట్టి, తర్వాతి మ్యాచ్‌లో కచ్చితంగా ఉంటాడని చెప్పొచ్చు. మూడు వరుస పరాజయాలతో సతమతమవుతున్న ముంబై ఇండియన్స్ జట్టుకు సూర్యకుమార్ యాదవ్ రాక కొత్త బలాన్ని నింపనుంది. ఎందుకంటే, గత మూడు మ్యాచ్‌ల్లో ముంబై జట్టు మిడిలార్డర్ బ్యాట్స్ మెన్స్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. ప్రస్తుతం టీ20 స్పెషలిస్ట్‌గా పేరు తెచ్చుకున్న సూర్యకుమార్ యాదవ్ రాకతో ముంబై జట్టు బ్యాటింగ్ బలం పెరుగుతుంది. ముఖ్యంగా మిడిలార్డర్‌లో ఇక నుంచి భీకర బ్యాటింగ్‌ను ఆశించవచ్చు. ముంబై ఇండియన్స్ తరపున 85 ఇన్నింగ్స్‌లు ఆడిన సూర్యకుమార్ యాదవ్ 2688 పరుగులు చేశాడు. అందులో 1 సెంచరీ, 20 అర్ధ సెంచరీలు చేశాడు. అంతేకాకుండా ముంబై ఇండియన్స్ తరపున అత్యధిక పరుగులు చేసిన మూడో ఆటగాడు. దీంతో సూర్య కుమార్ యాదవ్ ఎంట్రీ ముంబై ఇండియన్స్ జట్టు ఫలితాలపై ప్రభావం చూపుతుందనడంలో సందేహం లేదు.

## తెలంగాణ బోర్డర్‌లో ఎన్‌కౌంటర్.. ముగ్గురు మావోయిస్టులు మృతి

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందినట్టు తెలుస్తోంది. ఎన్‌కౌంటర్ సందర్భంగా ఒక ఏకే-47 గన్, పేలుడు పదార్థాలను పోలీసులు, భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. వివరాల ప్రకారం. ములుగు జిల్లా వెంకటాపురంలోని కర్రెగుట్ట ప్రాంతంలో భద్రతాబలగాలు, మావోయిస్టులకు మధ్య శనివారం ఉదయం ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందినట్టు సమాచారం. అనంతరం, ఘటనా స్థలంలో ఏకే-47 సహా మరో మూడు తుపాకులను, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన గురించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.



## కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి

ఇతర పార్టీల నేతల్ని చేర్చుకోవడం ప్రారంభించిందే కాంగ్రెస్ అని కేటీఆర్ ఎక్స్(ట్విటర్) వేదికగా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులపై మనసు మార్చుకున్నట్లు కనిపిస్తోందని చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్యేలు పార్టీ మారితే సభ్యత్వం రద్దు అనే హామీని ప్రకటించిందని తెలిపారు. "పదో షెడ్యూల్ చట్ట సవరణ స్వాగతించదగినది. కానీ కాంగ్రెస్ ఎప్పటిలానే చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి. ఇచ్చిన హామీకి వ్యతిరేకంగా వారి విధానాలు ఉంటాయి. ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఆ పార్టీ చేర్చుకుంది. అందులో ఒక ఎమ్మెల్యేకు ఎంపీ టికెట్ ఇచ్చింది. హామీలపై నిబద్ధత ఉంటే ఈ అంశంపై రాహుల్ గాంధీ మాట్లాడాలి. వారి పార్టీలో చేరిన ఇద్దరితో రాజీనామా చేయించాలి. అనర్హులని స్పీకర్ ప్రకటించాలి. చెప్పిందే చేస్తాం.. అబద్ధాలు చెప్పబోమని కాంగ్రెస్ నిరూపించుకోవాలి" అని కేటీఆర్ అన్నారు.

# సన్‌రైజర్స్ ఘన విజయం



ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆకట్టుకుంది. శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 6 వికెట్ల తేడాతో చెన్నై సూపర్‌కింగ్స్‌పై ఘన విజయం సాధించింది. తొలుత శివమ్‌దూబే(24 బంతుల్లో 45, 2 ఫోర్లు, 4సిక్స్‌లు), రహానే(35) రాణించడంతో చెన్నై 20 ఓవర్లలో 165-5 స్కోరు చేసింది. భువనేశ్వర్, నటరాజన్, కమిన్స్, షాబాజ్, ఉనద్కత్ ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనలో హైదరాబాద్..18.1 ఓవర్లలో 166-4 స్కోరు చేసింది. మార్క్రమ్(36 బంతుల్లో 50, 4ఫోర్లు, సిక్స్), అభిషేక్‌శర్మ(12 బంతుల్లో 37, 3ఫోర్లు, 4సిక్స్‌లు) విజృంభించారు. అలీ(2-23) రెండు వికెట్లు తీయగా, చాహర్, తీక్షణ ఒక్కో వికెట్ పడగొట్టారు. అభిషేక్‌శర్మకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

### రైజర్స్ ఆడుతూ పాడుతూ

చెన్నై నిర్దేశించిన లక్ష్యఛేదనను సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆడుతూ పాడుతూ ఛేదించింది. పసలేని చెన్నై బౌలింగ్‌ను ఆది నుంచే ఆలవోకగా ఎదుర్కొంటూ లక్ష్యం వైపు సాగింది. చాహర్ తొలి ఓవర్ రెండో బంతికే ట్రావిస్ హెడ్..ఔట్ నుంచి తప్పించుకున్నాడు. స్లిప్‌లో మొయిన్ అలీ క్యాచ్ విడిచిపెట్టడంతో బతికిపోయాడు. రెండో ఓవర్‌కు వచ్చిన ముకేశ్ చౌదరీని అభిషేక్‌శర్మ చీల్చి చెండాడు. మూడు కండ్లు చెదిరే సిక్స్‌లతో తోడు రెండు ఫోర్లతో ఏకంగా 27 పరుగులు స్కోరు బోర్డుకు జతచేశాడు. చాహర్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్‌తో అదే దూకుడు కొనసాగించబోయిన అభిషేక్..జడేజా సూపర్‌క్యాచ్‌తో తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. దీంతో మొదటి వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. శర్మ తర్వాత వచ్చిన మార్క్రమ్..హెడ్‌కు జతకలిశాడు. తుషార్ ఆరో ఓవర్లో మూడు ఫోర్లతో హైదరాబాద్ వికెట్ కోల్పోయి 78 పరుగులు చేసింది. ఈ క్రమంలో రైజర్స్ రెండో అత్యుత్తమ(78-1) పవర్‌ప్లే స్కోరును తమ ఖాతాలో వేసుకుంది. హెడ్, మార్క్రమ్ నింపాదిగా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. సాఫీగా సాగుతున్న క్రమంలో తీక్షణ 10వ ఓవర్లో హెడ్‌ను ఔట్ చేయడంతో రెండో వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. హైదరాబాద్ బ్యాటర్లను నిలువరించేందుకు చెన్నై కెప్టెన్ రుతురాజ్ బౌలర్లను మార్చిమార్చి ప్రయోగించినా లాభం లేకపోయింది.

### చెన్నై నెమ్మదిగా

టాస్ గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్..చెన్నైని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఢిల్లీతో గత మ్యాచ్ ఓటమి నుంచి ఇంకా పూర్తిగా తేరుకుని చెన్నై..తమ ఇన్నింగ్స్‌ను మందకోడిగా ప్రారంభించింది. దీనికి తోడు హైదరాబాద్ బౌలర్లు ఆది నుంచే తమదైన రీతిలో ఒత్తిడి పెంచుకుంటూ పోవడం కలిసి వచ్చింది. లీగ్‌లో మంచి ఫామ్‌మీదున్న ఓపెనర్ రచిన్ రవీంద్ర, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(26) జట్టుకు మెరుగైన శుభారంభాన్ని అందించలేకపోయారు. రహానేతో కలిసి శివమ్ దూబే..హైదరాబాద్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. షాబాజ్‌ను లక్ష్యంగా చేసుకుంటూ భారీ సిక్స్‌తో పాటు ఫోర్ బాదాడు. ఓ ఎండ్‌లో దూబే బౌండరీలతో విజృంభిస్తే..మరో ఎండ్‌లో రహానే చక్కని సహకారం అందించాడు. జైదేవ్ ఉనద్కత్ పరుగులను నియంత్రించడం రైజర్స్‌కు కలిసొచ్చింది. అప్పటికే మంచి ఊపులోకి వచ్చి ప్రమాదకరంగా మారుతున్న దూబేను కమిన్స్ ఔట్ చేశాడు. ఐపీఎల్‌లో కమిన్స్‌కు ఇది 50వ వికెట్. దీంతో మూడో వికెట్‌కు 39 బంతుల్లో 65 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. అప్పటికే పరుగుల రాక మందగించి ఒత్తిడిలో ఉన్న చెన్నై..ఉనద్కత్ బౌలింగ్‌లో రహానే వికెట్ కోల్పోవడంతో మరింత కష్టాల్లో పడింది. ఇదే అదనుగా హైదరాబాద్ తమ బౌలింగ్‌తో మరింత ఒత్తిడి పెంచడం కలిసొచ్చింది.

### నితీశ్‌రెడ్డికి చాన్స్

ఈ సీజన్‌లో తెలుగు యువ క్రికెటర్ నితీశ్‌కుమార్‌రెడ్డికి రైజర్స్ అవకాశం ఇచ్చింది. 2024లో మంచి ఫామ్‌మీదున్న క్లాసెన్(10 నాటౌట్)తో కలిసి నితీశ్(14 నాటౌట్) జట్టును గెలుపు తీరాలకు చేర్చా డు. దీపక్ చాహర్ 19వ ఓవర్లో తొలి బంతికే సిక్స్ కొట్టి నితీశ్..రైజర్స్‌కు సొంతగడ్డపై వరుసగా రెండో విజయాన్ని అందించాడు.

### సంక్షిప్త స్కోర్లు

చెన్నై: 20 ఓవర్లలో 165-5(దూబే 45, రహానే 35, భువనేశ్వర్ 1-28, జైదేవ్ 1-29),
హైదరాబాద్: 18.1 ఓవర్లో 166-4(మార్క్రమ్ 50, అభిషేక్ 37, అలీ 2-23, తీక్షణ 1-27)

## 2 తప్పులే మా ఓటమికి కా



సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో మెరుగైన ఆరంభం అందుకున్నా .. దానిని నిలబెట్టుకోలేకపోయామని చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ అన్నాడు. ఉప్పల్ పిచ్‌పై 170- 175 పరుగులు చేసి ఉంటే ఫలితం కాస్త వేరుగా ఉండేదని అభిప్రాయపడ్డాడు. ఏదేమైనా సన్‌రైజర్స్ ఆటగాళ్లు తెలివిగా బ్యాటింగ్ చేశారని కొనియాడాడు. కాగా ఐపీఎల్-2024లో సీఎస్‌కే తమ నాలుగో మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌తో తలపడింది. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆతిథ్య జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఓపెనర్లలో రచిన్ రవీంద్ర(12) మరోసారి తేలిపోగా.. రుతురాజ్ గైక్వాడ్(26) కాస్త మెరుగ్గా బ్యాటింగ్ చేశాడు. ఇక ఉప్పల్ పిచ్ స్లోగా ఉండటంతో రన్స్ తీయడానికి ఇబ్బంది పడ్డ రహానే 30 బంతులు ఎదుర్కొని 35 పరుగులు చేయగా.. శివం దూబే మాత్రం మెరుపులు(24 బంతుల్లో 45) మెరిపించాడు. స్పిన్నర్లను అటాక్ చేస్తూ పరుగులు రాబట్టాడు. దీంతో స్పిన్నర్లను పక్కనపెట్టి పేసర్లను దించిన రైజర్స్ సారథి ప్యాట్ కమిన్స్ తన బౌలింగ్‌లో దూబేను అవుట్ చేశాడు. అనంతరం జడ్డూ(31- నాటౌట్), డారిల్ మిచెల్(13) కాసేపు బ్యాట్ ఝులిపించినా.. ఆఖరి ఐదు ఓవర్లలో సీఎస్‌కేకు కేవలం 38 పరుగులు మాత్రమే వచ్చాయి.

## అయేషా ఖాన్ హాట్ లుక్స్



చిన్నది. మొన్న మధ్య శ్రీవిష్ణు హీరోగా నటించిన ఓం భీం బుష్ సినిమాలో గ్లామరస్ రోల్ చేసి అందరిని అలరించింది ఈ చిన్నది. అదేవిధంగా మాస్ కా దాస్ హీరోగా నటించిన గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాలో స్పెషల్ సాంగ్‌లో అలరించింది. ఇటీవలే ఈ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ పాటలో అయేషా ఖాన్ తన అందాలతో కుర్రాళ్ళ మతిపోగొట్టింది.అయితే తాజాగా ఈ చిన్నదాని లేటెస్ట్ ఫొటోలో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ఆ ఫోటోలను కొంతమంది జూమ్ చేసి అసభ్యకరంగా చూపించారు అని ఫైర్ అయ్యింది. మీడియా వాళ్లు కావాలనే ఇలా జూమ్ చేసి ఫోటోలు తీశారు అని మండిపడింది.



## 200 కిలోల గంజాయి పట్టివేత

వాహన తనిఖీలో పోలీసులు 200 కిలోల గంజాయి పట్టుకున్నారు. శనివారం విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం బొడ్డవర చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అరకు నుంచి రాజస్థాన్‌కు వెళ్తున్న వ్యానులో 200 కిలోల గంజాయిని గుర్తించారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



## డీఎంకే ఎమ్మెల్యే కన్నుమూత

తమిళనాడులోని విక్రవాండి నియోజకవర్గ డీఎంకే ఎమ్మెల్యే పుగజెండి శనివారం కన్నుమూశారు. విక్రవాండి సమీపంలోని వి.రోడ్డులో జరిగిన ఎన్నికల ప్రచార సభలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఆ సమయంలో ఎమ్మెల్యే పుగజెండి వేదికపైనే స్పృహతప్పి పడిపోయారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో ముండియంబాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

## ప్రభాస్ ఫ్యాన్స్‌కు షాక్

ప్రభాస్ హీరోగా, నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న మూవీ 'కల్కి 2898 AD'. మే 9న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కావాల్సి ఉంది. అయితే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని విడుదలను మే 30కి వాయిదా వేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాలో ప్రభాస్ సరసన దీపికా పదుకొణె సందడి చేయనున్నారు. కీలకపాత్రల్లో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్ నటించారు. అయితే పోస్ట్‌పోన్ గురించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

సూర్య www.suryaa.com
EVENING EDITION 4PM

# మంజుమ్మల్ బాయ్స్ రివ్యూ

చిదంబరం దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సౌబిన్ షాహిర్, శ్రీనాథ్ బాసి, బాలు వర్గీస్ కీలక పాత్రలు పోషించారు. తెలుగులో ఈ సినిమా ఈ రోజు విడుదలైంది. మరి ఈ చిత్రం, ఆడియన్స్‌ను ఏ మేరకు మెప్పించిందో సమీక్షలోకి వెళ్లి తెలుసుకుందాం.

కథ: కేరళలోని కొచ్చికి చెందిన మంజుమ్మల్ బాయ్స్.. కుట్టన్ (షౌబిన్ షాహిర్), సుభాష్ (శ్రీనాథ్ భాషి) మరియు వీరి మిత్రులందరూ చిన్నచితకా ఉద్యోగాలు చేసుకుంటూ సరదాగా ఉంటారు. అయితే, ఈ మంజుమ్మెల్ బ్యాచ్ కొడైకెనాల్ ట్రిప్ కు ప్లాన్ చేస్తారు. ఆ ట్రిప్ పై ఆసక్తి చూపని సుభాష్ ని కుట్టన్ ఒప్పించి తీసుకువెళ్తాడు. ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో మంజుమ్మెల్ బాయ్స్ అందరూ గుణ కేవ్ అనే లోతైన లోయ ప్రాంతానికి వెళ్తారు. ఆ లోయల్లో పడ్డవాళ్లెవ్వరూ ప్రాణాలతో బయటపడ్డదాఖలాలు లేవు. అందుకే గుణ కేవ్ లోపలికి వెళ్లడాన్ని నిషేధించారు. కానీ, మంజుమ్మెల్ బాయ్స్ మాత్రం సెక్యూరిటీ సిబ్బందికి కళ్లుగప్పి ఆ గుణ కేవ్ లోపలికి వెళ్తారు. అలా అనుకోకుండా సుభాష్ ఓ ఇరుకైన లోయ లోపలకి పడిపోతాడు. ఆ తర్వాత ఏం జరిగింది ?, సుభాష్ ప్రాణాలతో బయటపడ్డాడా ? లేదా ?, సుభాష్‌ను కాపాడటానికి కుట్టన్ ఎలాంటి సాహసం చేశాడు ?, చివరికి ఏం జరిగింది ? అనేది మిగిలిన కథ.

ప్లస్ పాయింట్స్: డిఫరెంట్ సర్వైవల్ కాన్సెప్ట్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాలో ఓ లోతైన లోయ చుట్టూ అల్లుకున్న ఇన్సిడెంట్స్, అలాగే స్నేహితుల మధ్య ఎమోషన్స్, టూరిస్ట్ గా వెళ్లి రియలిస్టిక్ గా అనుకోని ప్రమాదంలో పడే సీన్స్ అండ్ ఆ లోయలో నుండి బయట పడే సీన్స్ మరియు చివరిగా సినిమాలో ఉన్న మంచి మెసేజ్ ఈ సినిమాకే హైలెట్స్ గా నిలిచాయి. వందలాది అడుగుల లోతైన లోయలో పడిన ఓ యువకుడిని అతడి స్నేహితులు ప్రాణాలకు తెగించి ఎలా కాపాడారు అన్నదే మెయిన్ పాయింట్. ఈ చిన్న పాయింట్ చుట్టూ రియలిస్టిక్ ఎమోషనల్ డ్రామాను దర్శకుడు చిదంబరం చాలా బాగా బిల్డ్ చేశాడు. అలాగే, నటీనటుల యాక్టింగ్, విజువల్స్, బీజీఎమ్ ఈ సినిమాకు ప్రాణం పోశాయి. షౌబిన్ షాహిర్, శ్రీనాథ్ భాషిలతో పాటు మిగిలిన




పాత్రధారులందరూ చాలా బాగా నటించారు. వారిది యాక్టింగ్ అన్న అనుభూతి ఎక్కడ కలగదు. రియల్ లైఫ్ లో యూత్ గ్యాంగ్ ఎలా ఉంటారో, వాళ్ల అల్లరి కూడా అలాగే సాగింది. రియల్ మంజుమ్మెల్ బాయ్స్ లా వారి నటన ఆకట్టుకుంది. ఇక వందల అడుగుల లోతైన లోయల్లో పడ్డాక సాగిన సన్నివేశాలు చాలా సహజంగా అనిపించాయి. ఆ లోయలో పడ్డవాళ్లెవ్వరూ ప్రాణాలతో బయటపడలేదు అని తెలిసనా తమ స్నేహితుడి కోసం మంజుమ్మల్ బాయ్స్ ప్రాణాలకు తెగించే సంఘటనలు కూడా ఆకట్టుకుంటాయి. పోలీస్ స్టేషన్ సీన్ తో పాటు సుభాష్‌ను కాపాడేందుకు చేసే ప్రయత్నాలు కూడా మెప్పిస్తాయి. ముఖ్యంగా చిన్ననాటి ఎపిసోడ్ లను ప్రస్తుత లోయ ప్రాంతానికి కనెక్ట్ చేస్తూ చిదంబరం రాసుకున్న స్క్రీన్ ప్లే బాగుంది. అలాగే, ఈ సర్వైవల్ థ్రిల్లర్‌లలోని ఎమోషన్స్ అండ్ మెసేజ్ మరియు వాస్తవికత కూడా చాలా బాగా కుదిరింది.

మైనస్ పాయింట్స్: ఈ మంజుమ్మల్ బాయ్స్ సినిమా తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చినా.. కమర్షియల్ ఎలిమెంట్స్ కి మాత్రం దూరంగా సాగింది. ఇక చాలా లాజికల్ పాయింట్స్ ని పర్ఫెక్ట్ గా రివీల్ చేసిన డైరెక్టర్ కొన్నిటిని మాత్రం ఇన్ డైరెక్ట్ గా చాలా సింపుల్ గా చూపించి వదిలేశాడు. అలాగే, కీలకమైన సన్నివేశాలను బాగా రాసుకున్నప్పటికీ.. మిగిలిన సన్నివేశాల్లో ప్రధానంగా సెకండ్ హాఫ్ మధ్యలో వచ్చే కొన్ని సీన్స్ ను ఇంకా ఆసక్తికరంగా మలిచి ఉంటే బాగుండేది.

సినిమా చూస్తున్నంత సేపు తర్వాత ఏం జరుగుతుంది ?, సుభాష్ పాత్ర ఆ లోయ నుంచి ఎలా బయట పడతాడు ? అనే ఉత్కంఠను ప్రేక్షకుల్లో బాగానే కలిగించినా.. అదే పాయింట్ చుట్టూ కథను సాగదీయడంతో సినిమాలో కొన్నిచోట్ల స్క్రీన్ ప్లే స్లో అయ్యింది.

సాంకేతిక విభాగం: మంచి కథాంశం తీసుకోవడంలో సక్సెస్ అయిన దర్శకుడు చిదంబరం అంతే స్థాయిలో ఉత్కంఠభరితమైన కథనాన్ని రాసుకున్నాడు. కానీ, కొన్ని సన్నివేశాలను మాత్రం సింపుల్ గా మలిచాడు. సంగీత దర్శకుడు సుశీన్ శ్యామ్ సంగీతం చాలా బాగుంది.

తీర్పు: 'మంజుమ్మల్ బాయ్స్' అంటూ వచ్చిన ఈ ఎమోషనల్ సర్వైవల్ థ్రిల్లర్ లో చెప్పాలనకున్న మెయిన్ కంటెంట్ మరియు ఎమోషనల్ సన్నివేశాలు హృదయానికి హత్తుకుపోయాయి. అలాగే నటీనటుల నటన అద్భుతంగా అనిపిస్తోంది. ముఖ్యంగా కుట్టన్ – సుభాష్ మరియు ప్రధాన పాత్రల మధ్య సున్నితమైన భావోద్వేగాలు కూడా ఆకట్టుకున్నాయి.




## పశ్చిమ బెంగాల్ ఎన్ఐఏ అధికారులపై దాడి..
## ఇద్దరికి గాయాలు, కారు ధ్వంసం

పశ్చిమ బెంగాల్‌లోని తూర్పు మిడ్నాపూర్ జిల్లాలోని భూపతినగర్‌లో ఇవాళ (శనివారం) ఉదయం ఎన్ఐఏ బృందంపై దాడి జరిగింది. ఇద్దరు టీఎంసీ నేతలను అరెస్టు చేసేందుకు అధికారుల బృందం భూపతినగర్‌కు వెళ్లింది. అకస్మాత్తుగా 150 మంది గ్రామస్తులు గుమిగూడి నిందితులను తమతో తీసుకెళ్లకుండా NIA బృందాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా జనం ఎన్ఐఏ వాహనాలపై రాళ్లతో దాడి చేయడంతో ఇద్దరు అధికారులు గాయపడినట్లు తెలుస్తుంది. అయితే, కలకత్తా హైకోర్టు ఆదేశాల మేరకు 2022లో జరిగిన పేలుడు కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. గత నెలలో ఎన్ఐఏ 8 మంది టీఎంసీ నేతలను విచారణకు పిలిచింది. మార్చి 28న న్యూటౌన్‌లోని ఎన్ఐఏ కార్యాలయానికి అందరినీ రావాలని తెలిపింది. ఇదే కేసులో టీఎంసీ నేత మంబేంద్ర జానాతో పాటు మరొకరిని అరెస్ట్ చేసేందుకు ఎన్ఐఏ బృందం భూపతినగర్ చేరుకుంది. కానీ విచారణ సమయంలో అక్కడ ఉన్న గ్రామస్తుల నుంచి ఎన్ఐఏ నిరసనలను ఎదుర్కోవలసి వచ్చింది. నిందితులను తప్పించేందుకు అక్కడి ప్రజలు ప్రయత్నించారు. ఇందులో భాగంగానే ఎన్ఐఏ అధికారుల కార్లను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. దీంతో కారు విండ్ స్క్రీన్ దెబ్బతింది. సమాచారం అందుకున్న పోలీస్ బలగాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. ఉదయం 5.30 గంటల ప్రాంతంలో ఎన్ఐఏ అధికారులు అక్కడికి చేరుకున్నారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. దీనిపై స్థానిక పోలీసులకు ఎన్ఐఏ అధికారులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.




## భార్య పదేపదే పుట్టింటికి వెళ్లడం భర్తను హింసించడమే
### ఢిల్లీ హైకోర్టు స్పష్టీకరణ

భర్త పొరపాటు ఏమీ లేనప్పటికీ భార్య మాటిమాటికీ ఆమె పుట్టింటికి వెళ్లిపోతున్నట్లయితే అతనిని మానసికంగా హింసించినట్లేనని, క్రూరత్వ చర్యగానే పరిగణించాల్సి ఉంటుందని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. భార్యాభర్తల మధ్య పరస్పర ప్రేమ, విశ్వాసం, ఆరాధన భావన ఉంటే వారి వైవాహిక బంధం అన్యోన్యతలతో వికసిస్తుందని జస్టిస్ సురేశ్ కుమార్ కైత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. సంయమనం కోల్పోయిన దంపతుల మధ్య ఎడబాటు పెరుగుతూపోతే వారు ఎన్నటికీ కలవలేనంతగా పరిస్థితి మారిపోతుందన్నారు. భార్య హింస, క్రూరత్వ చర్యల కారణంగా విడివిడిగా ఉంటున్న దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 19ఏళ్ల వైవాహిక జీవితంలో కనీసం ఏడు సార్లు భార్య తనను వీడి వెళ్లిపోయిందని ఆమె భర్త కోర్టుకు తెలిపారు. అలా వెళ్లిన ప్రతిసారీ పది నెలల పాటు పుట్టింటిలో ఆమె ఉందన్నారు. కుటుంబ న్యాయస్థానం ఈ జంటకు విడాకులు ఇవ్వడానికి నిరాకరించగా....భర్త హైకోర్టును ఆశ్రయించారు.




## త్వరలో ఆర్‌బీఐ కొత్త మొబైల్ యాప్..

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) రిటైల్ ఇన్వెస్టర్ల కోసం కొత్తగా ఓ మొబైల్ యాప్ అందుబాటులోకి తీసుకురాబోతుంది. ఈ యాప్‌తో ప్రభుత్వ బాండ్లు లేదా సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టడం మరింత సులువు కానున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడుల కోసం ఆర్‌బీఐ రిటైల్ డైరెక్ట్ స్కీమ్‌ను 2021 నవంబర్‌లో ప్రారంభించింది. ఆర్‌బీఐ డైరెక్ట్ పోర్టల్ ద్వారా ప్రస్తుతం ప్రైమరీ, సెకండరీ మార్కెట్ ప్రభుత్వ సెక్యూరిటీల్లో మదుపు చేయొచ్చు. రిటైల్ ఇన్వెస్టర్లు వేలంలో ఈ సెక్యూరిటీలను అమ్మడం/ కొనడం చేసే వీలుంది. ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడులను మరింత సులభతరం చేసే ఉద్దేశంతో రిటైల్ డైరెక్ట్ పోర్టల్‌కు సంబంధించిన మొబైల్ యాప్‌ను తీసుకురానున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ నిర్ణయాలను తెలియజేసే క్రమంలో యాప్‌కు సంబంధించిన అంశాన్ని దాస్ ప్రస్తావించారు.



## తెలంగాణలో అసలు ఆట మొదలైంది
### తెలంగాణ రాష్ట్ర బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి


తెలంగాణలో ఎన్నికల ఆట మొదలైందన్నారు రాష్ట్ర బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి. రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగుకాబోతుందన్నారు. అలాగే, గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ గారడీలు చేస్తోందని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కాగా, కిషన్‌రెడ్డి బీజేపీ పార్టీ కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు సాధించబోతుంది. ఫిర్ ఏక్ మోదీ సర్కార్ అని ప్రజలు నినదిస్తున్నారు. మోదీ విశ్వనేతగా ప్రపంచానికి మార్గదర్శనం చేస్తున్నారు. తెలంగాణలో బీజేపీకి మంచి భవిష్యత్ ఉంది. రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగు కానుంది. కాంగ్రెస్ ఇంతకంటే ఎదగలేదు. తెలంగాణలో అసలు ఆట మొదలైంది. రాష్ట్రంలో బీజేపీని ఏమీ చేయలేరు. గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ నేతలు గారడీలు చేస్తున్నారు. గ్యారంటీల అమలు మీద సీఎం రేవంత్ రెడ్డికి దృష్టి లేదు కానీ.. పార్టీ ఫిరాయింపుల మీదే ఆయన ఫోకస్ పెట్టారు. తెలంగాణలో బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం. ఆర్టికల్ 370 రద్దు చేసి కశ్మీర్‌లో అంబేద్కర్ రాజ్యాంగం అమలు చేస్తున్నాం. అయోధ్యలో రామాలయ నిర్మాణం పూర్తి చేశాం. ట్రిపుల్ తలాక్ రద్దుచేసి ముస్లిం మహిళలకు అండగా నిలిచాం. బీజేపీ బలమైన శక్తిగా ఎదుగుతోంది. రాష్ట్రంలో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరుతున్నాను అంటూ కామెంట్స్ చేశారు.

## కంటోన్మెంట్ ఉప ఎన్నిక..
# కాంగ్రెస్ అభ్యర్థిగా శ్రీగణేశ

కంటోన్మెంట్ ఉప ఎన్నికలకు కోసం కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించింది. కంటోన్మెంట్ అభ్యర్థిగా శ్రీగణేష్ పేరును ఖరారు చేసింది. ఈ మేరకు శనివారం గణేష్ పేరును ప్రకటించారు కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్. కాగా, కంటోన్మెంట్ ఉప ఎన్నిక కోసం శ్రీగణేష్ ఎన్నికల బరిలో నిలిచారు. అయితే, శ్రీగణేష్ ఇటీవలే బీజేపీని వీడి హస్తం గూటికి చేరారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసిన శ్రీగణేష్ రెండో స్థానంలో నిలిచారు. ఇక, బీఆర్ఎస్ తరుపున పోటీ చేసి లాస్య నందిత విజయం సాధించారు. కాగా, ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో లాస్య మృతిచెందడంతో కంటోన్మెంట్‌లో ఉప ఎన్నిక జరుగనుంది. ఇక, తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలతో పాటే కంటోన్మెంట్ ఉప ఎన్నిక కూడా అదే రోజున జరుగనుంది. మాజీ మంత్రి జే. గీతారెడ్డి శిష్యుడిగా సుపరిచితుడైన గణేశ్ 2014 ఎన్నికల్లో కంటోన్మెంట్ నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం యత్నించారు. 2018 ఎన్నికల్లోనూ విశ్వప్రయత్నం చేశారు. అయితే ఆయనకు రెండుసార్లూ నిరాశే ఎదురైంది. దాంతో చివరి నిమిషంలో కాషాయ కండువా కప్పుకుని, గత ఎన్నికల్లో బీజేపీ టికెట్ తెచ్చుకున్నారు. అయితే ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికలు రావడంతో. మల్కాజిగిరి



ప్రస్తుత ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి ప్రోద్బలంతో బీఆర్ఎస్‌లో చేరారు. 2023 ఎన్నికల్లో అసెంబ్లీ టికెట్ తనకే దక్కుతుందని ఆశించారు. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యే జీ. సాయన్న హఠాన్మరణం చెందడంతో ఆయన వారసురాలిగా కుమార్తె లాస్యనందితకు బీఆర్ఎస్ టికెట్ కేటాయించింది. దాంతో శ్రీగణేశ్ మళ్లీ బీజేపీ కండువా కప్పుకుని ఆ పార్టీ నుంచి పోటీచేసి ఓడిపోయారు. లాస్యనందిత మృతి వల్ల త్వరలో జరిగే కంటోన్మెంట్ ఉపఎన్నికలో శ్రీగణేశ్ బీజేపీ నుంచి పోటీచేస్తారని అందరూ భావించారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో 40వేల ఓట్లు సాధించి, రెండోస్థానంలో నిలిచిన గణేష్.. ఉప ఎన్నికలో విజయం సాధిస్తారని బీజేపీ శ్రేణులు భావించాయి. అయితే అనూహ్యంగా ఆయన హస్తం గూటికి చేరారు.




## స్పెషల్ సాంగ్స్ కోసం
# భారీ రెమ్యునరేషన్

మలైకా నుండి సన్నీలియోన్ వరకు చాలా మంది సినిమాల్లో ఐటెం సాంగ్స్ చేశారు. 4 నుంచి 5 నిమిషాల పాటకు కోటి పారితోషికం తీసుకున్న హీరోయిన్లు చాలా మంది ఉన్నారు. కేవలం 5 నిమిషాల డ్యాన్స్‌కి ఇండియన్ సినిమాలో అత్యధికంగా 5 కోట్ల వరకు అందుకున్నవారు కూడా ఉన్నారు. ఇప్పటి వరకు ఇదే అతిపెద్ద రెమ్యునరేషన్. ఐటెం సాంగ్స్‌లో నటించి పేరు తెచ్చుకున్న హీరోయిన్స్ చాలా మంది ఉన్నారు. వారిలో మలైకా అరోరా ఒకరు. ఒక్కో పాటకు రూ.50 లక్షల నుంచి కోటి రూపాయలు అందుకుంది ఈ బ్యూటీ. కరీనా కపూర్ ఐటెమ్ డ్యాన్స్ కోసం 1.5 కోట్లు తీసుకుంది. మిల్కి బ్యూటీ తమన్నా భాటియా ఒక పాట కోసం రూ. 1 కోటి అందుకుంది. కత్రినా కైఫ్ ప్రత్యేక పాటలో కనిపించినందుకు 2 కోట్లు తీసుకుంది. బాలీవుడ్‌లో అత్యంత రెమ్యునరేషన్ అందుకున్నవారిలో సన్నీ లియోన్ ఒకరు. ఒక్కో పాటకు రూ.2-3 కోట్లు తీసుకుంది ఈ చిన్నది. వాళ్ళందరిని బీట్ చేసింది సమంత . అల్లు అర్జున్ 'పుష్ప' సినిమాలోని 'ఉ అంటేయ్యా మావా..' అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ పాట కోసం సమంత 5 కోట్ల రూపాయల పారితోషికం తీసుకున్నట్లు తెలుస్తోంది. సమంత తన కెరీర్‌లో తొలి స్పెషల్ ఐటెం సాంగ్ ఇది. ఐదు నిమిషాల పాటు కనిపించిన ఆ పాట సూపర్ హిట్ అయింది.

